ప్రచారంలో ప్రజలతో..

అవ్వా.. కారు గుర్తుకే ఓటెయ్యాలి

బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నిజామాబాద్‌లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. ఓ ఇంట్లోకి వెళ్లి వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరించారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని బాజిరెడ్డి కోరారు. - ఖలీల్‌వాడి

కార్మికుడి బిడ్డను.. ఆశీర్వదించండి

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 ప్రాజెక్టులో కార్మికులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. 'నేను కూడా సింగరేణి కార్మికుడి బిడ్డనే. మీ కష్టాలన్నీ నాకు తెలుసు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి నన్ను ఆశీర్వదించండి. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా'నని హామీ ఇచ్చారు. - యైటింక్లయిన్‌కాలనీ

మరోసారి దీవించండి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ఖమ్మం జిల్లా కల్లూరు మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం కల్లూరులోని ఓ బంగారు నగల దుకాణానికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఉన్నారు. - పెనుబల్లి

రైతుల పక్షాన పోరాడుతా

బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి శుక్రవారం నల్లగొండ జిల్లాలోని త్రిపురారం, చింతపల్లి, దేవరకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, నోముల భగత్, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో రైతుల పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చారు. - త్రిపురారం

ఇదీ మా మ్యానిఫెస్టో

మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మజీద్ వద్దకు వెళ్లి ముస్లింలను కలిసి బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేసిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలని వారు కోరారు. - మహబూబ్‌నగర్ అర్బన్

మోత్కూరు రోడ్‌షోలో క్యామ మల్లేశ్

భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో రోడ్‌షో నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు. - మోత్కూరు

50 వేల మెజారిటీతో గెలుపు తథ్యం

వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి శుక్రవారం రాత్రి వరంగల్ జిల్లా పర్వతగిరి రోడ్‌షోలో నిర్వహించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి 50 వేల మెజారిటీతో గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు. - పర్వతగిరి

కేసీఆర్ పదేండ్ల పాలన చూడండి..



శుక్రవారం రాత్రి చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ వికారాబాద్ జిల్లా తాండూరులో బీఆర్ఎస్ ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. కాసాని మాట్లాడుతూ.. పదేండ్ల పాలనలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తనను గెలిపించాలని కోరారు. - తాండూరు

నా మద్దతు బీఆర్ఎస్‌కే

- నాగర్‌కర్నూల్‌లో ఆర్ఎస్పీని గెలిపిస్తాం
- మాజీ ఎంపీ మంద జగన్నాథం ప్రకటన

మంద జగన్నాథం

ఎర్రవల్లి చౌరస్తా, మే 10 : తన మద్దతు బీఆర్ఎస్ పార్టీకేనని మాజీ ఎంపీ మంద జగన్నాథం ప్రకటించారు. శుక్రవారం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం కొండేరులో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు బేషరతుగా మద్దతు తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న తాను కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మి ఆ పార్టీలో చేరానని, ఆ తరువాత తనకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంపై బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు పూర్తి పట్టు ఉన్నదని, ఆయనకే ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మైనార్టీల ఓటు తోఫా బీఆర్ఎస్‌కే!

- బీజేపీని నిలువరించే శక్తి కాంగ్రెస్‌కు లేదు
- బీజేపీలో సీఎం రేవంత్ చేరికపై అనుమానాలు
- లౌకిక పునాది, ఆచరణ ఉన్న పార్టీలనే ఆదరించాలి
- స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సమూహ 'పెద్దలు'

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మైనార్టీలు ఏ పార్టీకి ఓటు వేయాలన్న విషయమై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా బీజేపీని అడ్డుకునే శక్తి కాంగ్రెస్‌కు లేదని తీర్మానించుకున్నట్టు సమాచారం. అన్నదమ్ముళ్లలా సామరస్యంతో సహజీవనం సాగిస్తున్న ప్రజలను 'ఓటు'వర్గాలుగా విభజించి విద్వేష రాజకీయాలు చేస్తున్న బీజేపీని కట్టడి చేయడం కాంగ్రెస్‌తో సాధ్యం కావడం లేదని నిర్ధారించుకున్న మైనార్టీలు బలమైన లౌకిక వాద పునాది, ఆచరణ ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీలకు అండగా ఉండాలని నిశ్చయించుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ జాతీయ పార్టీగా కాకుండా పెద్దసైజ్ ప్రాంతీయ పార్టీగా రూపాంతరం చెందిందని, ఫలితంగా ఆ పార్టీని అంటిపెట్టుకొని ఉంటే తమకు శాశ్వతంగా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని మైనార్టీల పెద్దలు నిర్ధారణకు వచ్చారని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు జై కొట్టాలని నిర్ణయం తీసుకున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. వారి సమూహ సమావేశాల్లో 'విధాన' సంకేతాలు పంపినట్టు చెప్తున్నారు. ఈ పరిణామాన్ని అందిపుచ్చుకొనేందుకు రాష్ట్రంలో మైనార్టీ వర్గాల ప్రభావం అత్యధికంగా ఉండే హైదరాబాద్, సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, చేవెళ్ల, మెదక్ మొదలైన పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ సైతం విస్తృత కార్యాచరణను చేపట్టింది.

కాంగ్రెస్‌కు బీజేపీని నిలువరించే శక్తి లేదు!

బీజేపీని కాంగ్రెస్ నిలువరించలేదని దేశవ్యాప్తంగా స్థిరమైన అభిప్రాయం నెలకొన్నదని, దేశంలో మరోసారి ప్రాంతీయ పార్టీలు నిర్ణయాత్మక శక్తిగా కీలక పాత్ర పోషించనున్నాయనే సంకేతాలు ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ఈసారి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడబోతున్నది. అందులో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించనున్నది' అని ఎలా వెల్లడిస్తారు? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు 'గాలిలో కాల్పులు' అన్నట్టుగా వ్యవహరించే వ్యక్తి కాదని, ఎంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయన దాదాపు ప్రతి సభలో ఇదే విషయాన్ని పదేపదే పేర్కొనడంలో కచ్చితమైన ప్రాతిపదిక ఉంటుందని ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలోని మైనార్టీలు కేసీఆర్‌కు అండగా ఉండాలని తీర్మానించుకున్నట్టు భావిస్తున్నారు. మణిపూర్, కశ్మీర్, ఉత్తరప్రదేశ్, కేరళలో మైనార్టీలపై బీజేపీ ప్రదర్శిస్తున్న అక్కసును కాంగ్రెస్ నిలువరించడంలో విఫలమైందని వారు ఉదహరిస్తున్నారు.

రేవంత్‌రెడ్డిపై బీజేపీ వరుస ప్రకటనలు

పార్లమెంట్ ఎన్నికలు అయిపోగానే సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరతాడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పదేపదే చెప్తున్నారు. వాటికి బలం చేకూర్చే విధంగా బీజేపీలో, కేంద్ర ప్రభుత్వంలో నం.2గా ఉన్న అమిత్‌షా సైతం దాదాపు అదే అర్థం వచ్చేలా చేస్తున్న వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలెవరూ ఖండించకపోవడం మైనార్టీల్లో అనుమానాలను రేకెత్తించినట్టు తెలుస్తున్నది. ఇటీవల జగిత్యాలలో రేవంత్‌రెడ్డి బీజేపీ అభ్యర్థి అర్వింద్ వ్యాఖ్యలకు దీటుగా సమాధానం చెప్పలేదని ఆ లోక్‌సభ పరిధిలోని ఓ మైనార్టీ నాయకుడు ఉదహరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో మైనార్టీలకు అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఆ తరువాత చేతులెత్తేసిందని ఆ వర్గం నేతలు విమర్శిస్తున్నారు. షబ్బీర్ అలీ లాంటి నాయకుడిని అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర ప్రాంతానికి పంపి ఓడగొట్టడమే కాకుండా, కనీసం ఎమ్మెల్సీ కూడా ఇవ్వకపోవడంపై ఆ సామాజికవర్గం కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నది. కాంగ్రెస్ తమ వర్గానికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలని భావిస్తే ప్రజాబలం ఉన్న నాయకులకు కాకుండా హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ఇతరులకు టికెట్ ఎలా ఇస్తారని వారు గుర్రుగా ఉన్నారనే వాదనకు రోజురోజుకు బలం చేకూరుతుంది.

కేసీఆర్ హయాంలో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మైనార్టీలకు కలిగిన మేలు, ఐదునెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన అడుగులతో బేరీజు వేసుకున్న మైనార్టీలు ఏకపక్షంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నుంచి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల దాకా జరిగిన 'మార్పు'ను అంచనా వేసిన అనంతరమే మైనార్టీలు బీఆర్ఎస్‌కు జై కొట్టాలని తీర్మానించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. షాదీముబారక్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్, మైనార్టీ గురుకుల విద్యాలయాల ఏర్పాటుతోపాటు బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కార్ చూపిన దార్శనికతను గుర్తుచేసుకొని కేసీఆర్‌కు 'తోఫా' ఇచ్చేందుకు వారు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. కేసీఆర్ నిర్వహిస్తున్న రోడ్‌షోలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్వహిస్తున్న సభలు, సమావేశాల్లో మైనార్టీల భాగస్వామ్యం పరిశీలకుల అంచనాలను నిజం చేస్తున్నది.

కరీంనగర్‌లో దళిత సంఘాల నాయకులతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కు పలు సంఘాల మద్దతు

కరీంనగర్, మే 10 (నమస్తే తెలంగాణ)/ తెలంగాణచౌక్: కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు పలు సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. దళిత సంఘాలతోపాటు కార్మిక సంఘాలు అండగా నిలిచాయి. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని ఆయా సంఘాల వారు ప్రకటించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ అధ్యక్షతన శుక్రవారం కరీంనగర్‌లో దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేడి మహేశ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో దళితుల ఉనికికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. రిజర్వేషన్లు తొలగించాలని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టు భావజాలం కలిగి, దళిత బహుజన వాదాన్ని తన విధానంగా మార్చుకున్న కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ప్రకటించారు. ఈ మేరకు మాదిగ సంఘాల నాయకులు వంతడుపుల సంపత్, అశోక్, సాంబారి కొమురయ్య, క్యాదాసు ప్రభాకర్, భీమారపు సతీశ్ తదితరులు తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం వారు వినోద్‌కుమార్‌ను కలిసి తమ మద్దతును ప్రకటించారు.

కార్మిక సంఘాల మద్దతు

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు కార్మిక సంఘాలు బాసటగా నిలిచాయి. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, ఆటో యూనియన్ సంక్షేమ సంఘం నగరం కమిటీ అధ్యక్షుడు మద్దెల రాజేందర్ శుక్రవారం కరీంనగర్‌లో మీడియా మాట్లాడారు. బీజేపీ సర్కారు తెచ్చిన లేబర్ కోడ్‌తో కార్మికుల స్వేచ్ఛను హరించిందని మండిపడ్డారు. ప్రధాని మోదీ ప్రైవేట్ రంగానికి పెద్దపీట వేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు న్యాయమైన హక్కులు దక్కాలంటే, పార్లమెంట్‌లో మన గళం వినపడాలంటే వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌కే క్రైస్తవుల ఓటు

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మైనార్టీలకే ప్రమాదం
- క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సాల్మన్ రాజు

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎం సాల్మన్‌రాజు

ఖైరతాబాద్, మే 10: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే క్రైస్తవులకు గుర్తింపు లభించిందని, లోక్‌సభ ఎన్నికల్లో క్రైస్తవులంతా బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తారని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు ఎం. సాల్మన్‌రాజు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాప్టిస్ట్ చర్చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్ శాంతిరాజ్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 వరకు అన్ని ప్రభుత్వాలు క్రైస్తవులను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రాధాన్యం కల్పించారని పేర్కొన్నారు. క్రిస్మస్, బాక్సింగ్ డేలకు పబ్లిక్ హాలిడేగా ప్రకటించారని, నిజాం కళాశాలలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణను అక్కున చేర్చుకొని దళితులందరినీ పక్కన పెట్టిందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అన్ని వర్గాలు, మతాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో క్రిస్టియన్ జేఏసీ నాయకులు జ్యూడ్ రవి, అంద్రూ జేవియర్, డానియల్, లియో, శ్యామ్‌సన్, ప్రకాశ్, రవి కుమార్, సూరిబాబు, రాజేశ్ పాల్గొన్నారు.

మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాలు

కాసానిని గెలిపించండి

మొయినాబాద్, మే 10 : బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీసీ సంఘాల నేతలు, నాయకులతో కలిసి మాట్లాడారు. జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభ్యున్నతికి కృషి చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బీసీలందరూ సంఘటితమై భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షుడు జయవంత్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీతో మాదిగలకు మోసం

- ఈ రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి పిలుపు

వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, మే 10: సామాజిక వాదం, మనువాదం ముసుగులో మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఎంపీ టికెట్ ఇవ్వకుండా దగా చేశారని మండిపడ్డారు. ఆయన కుటుంబ సభ్యులకు మాత్రం టికెట్లు, పదవులు ఇప్పించుకొన్నారని ఆరోపించారు. అహంకారంతో కుటుంబ పాలనకు తెరలేపిన రేవంత్‌రెడ్డికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీ పాలనలో దళితులపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని తెలిపారు. దళితులను ఆలయాల్లోకి రానివ్వకుండా అడ్డుకున్న బీజేపీకి దళితులను ఓట్లు అడిగే హక్కు లేదని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందన్‌ను ఒడిశాలో జగన్నాథ ఆలయంలోకి రానివ్వలేదని, అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును ఆహ్వానించకుండా ఘోరంగా అవమానించారని ఆవేదన వ్యక్తంచేశారు.

అభివాదం చేస్తున్న డాక్టర్ కొండ దేవయ్య పటేల్, హరికృష్ణ, శివ తదితరులు

మున్నూరుకాపు అభ్యర్థులను గెలిపించుకుంటాం

- తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవయ్య పటేల్

ఖైరతాబాద్, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలకతీతంగా మున్నూరుకాపు అభ్యర్థులను గెలిపించుకుంటామని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్యపటేల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50లక్షలకు పైగా మున్నూరుకాపు జనాభా ఉందని, రాజకీయంగా మాత్రం వెనుకబాటుకు గురయ్యామని తెలిపారు. బీఆర్ఎస్‌తో పాటు అన్ని పార్టీలు మున్నూరుకాపులకు ప్రాధాన్యమిచ్చాయని, ఆయా స్థానాల్లో తమ సామాజికవర్గ అభ్యర్థులను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శులు వాసాల వెంకటేశ్వర్లు, తేల్ల హరికృష్ణపటేల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ బాలకృష్ణపటేల్, యువజన విభాగం అధ్యక్షుడు దేశెట్టి శివ పటేల్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి లత, గ్రేటర్ అధ్యక్షుడు ఆర్వీ మహేందర్, రాజబాబు, వెంకటేశ్, రవీందర్, కుమార్ భూపతి, ప్రదీప్ పాల్గొన్నారు.